# బదిలీలు

'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నట్టుగానే పరిశ్రమలన్నా, కర్మాగారాలన్నా యంత్రాలు కావు - యంత్రాల వెనుక నున్న మనుషులూ, వ్యవహార నిర్వాహకులూ.

పరిసరాలూ, ఆ పరిసరాల్లో జీవించే ప్రజల మనస్తత్వాలూ పరిశ్రమల మీద రకరకాల ప్రభావాలు చూపుతాయి. అందుకనే ఒక ప్రాంతంలో సులువుగా జరిగే పని మరో ప్రాంతంలో ఎంతో కష్టపడితేనే కాని జరగదు. ఈ అవగాహనా, అనుభవమూ ఉద్యోగులకి చాలా అవసరం. దేశవ్యాప్తమైన సంస్థల్లో పన్జేస్తున్న ఉద్యోగుల మానసిక వికాసానికీ, సంస్థల అభివృద్ధికీ బదిలీలు అనేవి ఎంతగానో ఉపయోగపడ్తాయి. చుట్టపు చూపుగా శ్రీనగర్ విలాసయాత్ర వెళ్ళడంలోనూ, అక్కడో రెండు మూడు సంవత్సరాలు పన్జేయడంలోనూ ఎంతో తేడా ఉంటుంది.

కానైతే ఉద్యోగులు బదిలీలని తమ వ్యక్తిగతమైన సమస్యలతో ముడిపెట్టి చాలా చికాకులు తీసుకువస్తారు. ప్రస్తుతం పన్జేస్తున్న ప్రాంతాన్ని బట్టి, బదిలీ అయిన ప్రాంతాన్ని




బట్టి ఉద్యోగులు వేరు వేరు పరిస్థితుల్లో వేరువేరుగా ప్రవర్తిస్తూ ఉంటారు. అందుకనే ఈ బదిలీల 'సీజనం'టే నాకు తలనొప్పి.

నేను మన దేశపు ఓ ఈశాన్య రాష్ట్రంలో రెండవ తడవ పన్జేస్తున్న కాలమది. రణధీర్ గోయల్ అనే ఓ జూనియర్ ఆఫీసరు నా గదిలో అడుగు పెట్టాడు. కూర్చోమని చెప్పి, సంగతేమిటని అడిగాను.

"సర్, హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ సంవత్సరపు బదిలీల విషయమై మీ అభిప్రాయాల కోసమూ, రికమెండేషన్ల కోసమూ ఉత్తరం వచ్చిందని విన్నాను. దయచేసి నన్ను డెహ్రాడూన్ బదిలీ చేయించండి" అన్నాడు చేతులు నలుపుకుంటూ.

వాస్తవానికి ఆ ఉత్తరం అప్పటికి నా బల్ల చేరలేదు! అయినా ఆఫీసుల్లో కూపీలు లాగే ఉద్దండులు చాలామందే ఉన్నారు. అక్కడ ఉత్తరం మీద సంతకం జరగక మునుపే యిక్కడ తెలిసిపోతుంది.

గోయల్ సంగతి నాకు ముందుగావే తెలుసు. మా సంస్థలో జేరిన వెంటనే డెహ్రాడూన్‌లో అయిదేళ్ళు పనిచేశాడు. బదిలీ ఉత్తర్వులు వచ్చిన తర్వాత ఏడాది వాయిదా వేయించుకొని, ఆ తర్వాత వచ్చి యిక్కడ చేరాడు. వెళ్ళిపోయేవాళ్ళు వెళ్ళిపోయి, రావల్సినవాళ్ళు రాకపోతే చాలా రకమైన యిబ్బందులుంటాయి. మా సంస్థ నిబంధనల ప్రకారం ఈశాన్య రాష్ట్రాలలో ప్రతి ఉద్యోగి విధిగా మూడు సంవత్సరాల కనీస కాలం పనిచేయాలి. గోయల్ వచ్చి యింకా రెండు సంవత్సరాలు కూడా పూర్తి కాలేదు. అదే మాట అన్నాను.

“నువ్వొచ్చి రెండేళ్ళు కూడా పూర్తికాలేదు, అప్పుడే ఏం తొందరొచ్చిందని?!”

“సర్, మా తల్లిదండ్రులు వృద్ధులైపోయారు. వారికీ మధ్య ఒంట్లో బావుంటల్లేదు. నేనే పెద్దవాణ్ణి. బదిలీ కోసం అర్జీ పెట్టుకొంటున్నాను. గంగూలీ సర్ మీకు ‘ఫార్వర్డ్’ చేశారు” అంటూ ఓ అప్లికేషన్ నా ముందుగా ఉంచాడు.

“నువ్వన్న ఆ ఉత్తరం నా బల్ల మీదకింకా రానే లేదు! ఈ సంగతి నీకెలా తెలిసిందో, ఏ ఆధారమూ లేకుండా గంగూలీ ఎలా నీ అప్లికేషన్ మీద సంతకం పెట్టాడో, స్వయంగా వచ్చి నువ్వే ఈ అప్లికేషన్ ఎందుకిస్తున్నావో – యివన్నీ నా కర్థం కాని విషయాలు! సరే ఆ విషయం నేను సీరియస్‌గా తీసుకోదలచలేదు. చూడు, గోయల్! నా కిప్పుడు ఏభై అయిదేళ్ళు. నిజానికి బదిలీ కోసం నేను అప్లికేషన్ పెట్టుకోవాలి! నీ తల్లిదండ్రులు ముసలివారైపోయారూ అంటే సమంజసంగా ఉండదు!” అన్నాను నవ్వుతూ.

రాళ్ళలా ఉండేవాళ్ళని కూడా మంచాలెక్కించేస్తాయి ఈ అప్లికేషన్లు! ఆ మాట తిన్నగా అనడం భావ్యం కాదు కదా?

“సర్, మీ ఆంధ్రాలో పెళ్ళిళ్ళు త్వరగా అయిపోతాయి. మాలో అలా కాదు” అన్నాడు సీరియస్‌గా కళ్ళింత చేసుకొని.

“వాళ్ళు చేసిన ఆలస్యం నువ్వు చెయ్యకు! ఎనిమిదేళ్ళుగా ఉద్యోగం చేస్తూ యింకా బ్రహ్మచారిగానే ఉండిపోయావు! నీ తమ్ముడు కూడా డెహ్రాడూన్‌లో మన సంస్థలోనే నాలుగేళ్ళుగా పన్జేస్తున్నాడనుకొంటాను. నీ తల్లిదండ్రులు వంటరిగా లేనప్పుడు, నువ్వు బదిలీ కోసం నిర్ణీతమైన సమయానికి ముందే కంగారుపడడంలో అర్థం లేదు! ఆలోచించుకో” అన్నాను అనునయంగా.

గోయల్ మాట్లాడలేకపోయాడు అతగాడి తమ్ముడు డెహ్రాడూన్‌లో పన్జేస్తున్న సంగతి నాకెలా తెలిసిందీ అన్న దిగ్భ్రాంతిలో పడిపోయి.

“నీ అప్లికేషన్ పంపమంటే పంపుతాను. కాని, దాని మీద నా ‘రిమార్క్’ నీకు వ్యతిరేకంగా ఉంటుంది!” – మాటలు నాన్చడం నా కలవాటు లేని పని.

గోయల్ ఆ అప్లికేషన్ వెనక్కి తీసుకోకుండా అలానే వదిలి వెళ్ళిపోయాడు.

మా సంస్థ ప్రధాన కేంద్రం అతగాడి ఊరే కాబట్టి, ఏమైయ్యుంటుందో మీ

రూహించుకోవచ్చు. బదిలీ అయిన ఉద్యోగులకి వీడ్కోలు చెప్పే మహోత్సవంలో అందరితోబాటూ గోయల్‌కీ పుష్పగుచ్ఛాన్ని అందజేశాను. అతని పెదవుల మీద చిరునవ్వు. నా పెదవుల మీద చిరునవ్వు. యివన్నీ మా కలవాటే! కక్షగట్టి రక్తపు పోటు పెంచుకోవడం అర్థం లేని పని. ఎవరి అవసరాన్ని బట్టి వారు ప్రయత్నాలు చేసుకొంటారు.

దేశ రాజకీయాలకి తలమానికమైన ఉత్తర ప్రదేశ్‌లోని ఓ ముఖ్యమైన పట్టణమూ,మా సంస్థకి ప్రధాన కేంద్రమూ అయిన డెహ్రాడూన్‌లో (ప్రస్తుతం డెహ్రాడూన్ ఉత్తరాంచల్ రాష్ట్ర రాజధాని) పనిచేసే సమయంలో జరిగిన ఓ చిన్న ఉదంతం - వికాస్ వాజ్‌పాయ్ అనే ఓ సైంటిఫిక్ ఆఫీసరుకి ముంబయి బదిలీ అయింది. చాలా డీలా పడిపోయాడు. సంగతేమిటని ప్రశ్నించాను.

"పనిలో అనుభవం బాగా వస్తుందని మీరు నన్ను ముంబయ్ బదిలీ చేయించారు. నేనూ చాలా సంతోషించాను. అయితే నా తల్లిదండ్రులు నన్నూ, నా భార్యనీ అపార్థం చేసుకొని, తమతో ఉండడం యిష్టం లేక బదిలీ చేయించుకొన్నామని మాటలతో హింసిస్తున్నారు. మా నాన్న తన పరపతినుపయోగించి బదిలీ ఆపు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాడు!" అన్నాడు దీనంగా ముఖంపెట్టి.

"మీ నాన్నగారింకా సర్వీసులో ఉన్నారుకదా, ఎందుకని గొడవ పెట్టడం?"

"మీకు తెలియంది ఏముంది సార్, వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు. వాళ్ళ దృక్పథంలోనే ఆలోచిస్తున్నారు. అప్పటికీ చెప్పాను - నెలనెలా డబ్బు పంపిస్తాననీ, చెల్లాయి తమ్ముళ్ళ చదువు బాధ్యత తీసుకొంటాననీ. 'ఓసారి ఊరు వదిలి వెడ్తే మా ఊసే మర్చిపోతావ'ని వాళ్ళ ధోరణి వాళ్ళదే! నస భరించలేకుండా ఉన్నాను. ఏం చెయ్యాలో తోచటల్లేదు" అని వాపోయాడు.

"సరే, మీ నాన్నగార్ని వచ్చి నన్నోసారి కలుసుకోమని చెప్పు" అని వికాస్‌ని పంపించాను.

ఆ మర్నాడుదయం వికాస్ వాళ్ళ తండ్రిని తీసుకొచ్చి, నాకు పరిచయం చేసి వెంటనే గది వదిలి బయటకు వెళ్ళిపోయాడు. కేంటీన్ కుర్రవాడు రెండు కప్పులతో టీ తీసుకు వచ్చాడు.

"తాగండి" అన్నాను వికాస్ తండ్రితో.

కాస్త యిబ్బందిగానే టీ తీసుకొన్నాడు.

"మీతో కొన్ని విషయాలు ముఖాముఖి మాట్లాడాలని పిలిపించాను. ఏమీ అనుకోవద్దు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో యింజనీరింగ్‌లోనూ, పోస్టు గ్రాడ్యుయేట్ సైన్సుల్లోనూ డిగ్రీలు తీసుకొన్న ఓ ఆరుగురు ఈ సంస్థ ప్రవేశ పరీక్షల్లో పాసయి, ఆంధ్ర రాష్ట్రంలోనే ఉన్న ఓ ప్రాజెక్ట్‌లో పోస్టు చెయ్యబడ్డారు. చేయించుకొన్నారు అంటే బావుంటుందేమో? యిక్కడున్న

వాళ్ళు ఈ ఊళ్ళో పోస్టు చేయించుకోవడానికి ఎలా పాట్లు పడతారో, వాళ్ళూ అలాగే పాట్లు పడ్డారు! వాళ్ళేరకమైన ఒత్తిళ్ళు తీసుకువచ్చారో వాళ్ళకే తెలియాలి, లేదా మానవ వనరుల విభాగానికి తెలియాలి! ఆ ఆరుగురిలో కొంతమంది అదే ఊరికి చెందినవారు. ఉన్న రాష్ట్రం, లేదా ఉన్న ఊర్లోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఉద్యోగం. మేరేజి మార్కెట్లో కూడా మంచి విలువ సంపాదించారు. అయిదేళ్ళు హాయిగా గడిపేశారు.

"నేను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సమయంలో, వారిలో ఓ నలుగురు బదిలీ మీద వచ్చారు. కాని వచ్చిన దౌర్భాగ్యమేమిటంటే వాళ్ళే ప్రాజెక్ట్ నుంచి వచ్చారో అది చాలా చిన్నది. అందుకని అనుభవం ఏమాత్రమూ గడించలేకపోయారు. వాళ్ళ తర్వాత మా సంస్థలో చేరిన జూనియర్స్, స్వతంత్రంగా అహ్మదాబాద్‌లో ఫీల్డ్ ఆపరేషన్స్‌కి వెడ్తూంటే వీళ్ళు మట్టుకు నోళ్ళు వెళ్ళబెట్టుకొని బిక్కచచ్చిపోయారు. పని నేర్పడానికి పై వాళ్ళకి తీరుబడి లేకా, చిన్నవాళ్ళ దగ్గర పని నేర్చుకోవడానికి వీళ్ళకి ఆభిజాత్యం అడ్డొచ్చీ, నానాయాతనా పడవలసి వచ్చింది. వాళ్ళని దారిలో పెట్టడానికి మాకు ఏడాదికి పైగా పట్టింది. వాళ్ళ పనిని పర్యవేక్షించే సీనియర్ల రిపోర్టులంతంత మాత్రంగా ఉండడం వల్ల ప్రమోషన్లు మిస్ అయ్యారు.

"మరి యిళ్ళలో నాయనమ్మల వంటలే తిన్నారో, మాతృమూర్తుల ప్రేమలో ఓలలాడారో నాకు తెలియదుకాని, అయిదేళ్ళ తర్వాత ఊరు మారినప్పుడు, ఆఫీసు ఫ్రంట్‌లో తుంటి పళ్ళు రాలగొట్టుకొన్నారు. మీ వికాస్ తెలివైనవాడు. యిక్కడ ప్రధాన కేంద్రంలో పన్జేస్తే రాజకీయాలు అలవాటుపడ్తాయి కాని, ప్రోజెక్టు అనుభవం రాదు. అందుకని నేనే రికమెండ్ చేసి అతణ్ణి ముంబయ్ బదిలీ చేయించాను. నిజానికి నాకూ వికాస్‌ని వదలాలని లేదు.కాని నా స్వార్థం, నా ఆఫీసు స్వార్థం చూసుకొంటే అతని భవిష్యత్ దెబ్బదింటుంది. అది మా సంస్థకీ మంచిది కాదు. వికాస్ మంచి కోరి నేను చేయించిన బదిలీని మీరు మరోలా అపార్థం చేసుకొన్నారని విన్నాను.

"అతన్ని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి, సెంటిమెంట్లతో చావగొడ్తే మీకువచ్చే లాభం ఏమిటో నాకు తెలియదు కాని, అతనికి వచ్చే నష్టం మట్టుకు చాలా ఉంది! స్థానికమైన మీ పరపతిని ఉపయోగించి వికాస్ బదిలీని ఆపు చేయించడానికి ప్రయత్నించే ముందు, నేను చెప్పిన మాటల్ని దృష్టిలో ఉంచుకొని మరోమారు ఆలోచించండి" అంటూ నా మాటల్ని ముగించాను.

వికాస్ తండ్రి ఏ సమాధానమూ చెప్పకుండా బయటకు దారితీశాడు.

ఆ తర్వాత ఏం జరిగిందీ నేను చెప్పదలచుకోలేదుకాని, వికాస్ తండ్రి స్థానంలో ఉంటే మీరేం చేసేవారో ఆలోచించుకోండి.

ఆఫీసు పరంగా ఆలోచించి చేసే బదిలీలు, ఉద్యోగులకు వ్యక్తిగతమైన కొన్ని చికాకుల్ని

కలిగిస్తాయి. అవి తప్పవు. మన సామాజిక వ్యవస్థలో పెనవేసుకొని పోయిన మమతలూ, బంధుత్వాలూ, బాధ్యతలూ, పిల్లల చదువులూ, పెద్దల అనారోగ్యాలూ, ఒకటేమిటి, అనేక రకాలుగా ఉంటాయి.

బ్రహ్మచారులుగా ఉన్నప్పుడూ, వివాహమయి పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడూ దేశంలోని కొన్ని నిర్ధారితమైన కష్టతర ప్రాంతాల్లో అధిక కాలం పన్జేస్తే, అనుభవంతో రాటు దేలడమే కాకుండా, ఓ నిర్ణీతమైన విధానంలో పిల్లల చదువుకి ఆటంకం కలుగకుండా చేసుకోవచ్చు. పది, పన్నెండు తరగతులు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విద్యార్జన దశలో చాలా ముఖ్యం కాబట్టి, సంస్థలు కూడా చాలా మట్టుకు సానుభూతితో ప్రవర్తించి సర్దుబాట్లకి ప్రయత్నిస్తాయి. ఒకసారి ఆ దశా దాటిన తర్వాత ఉద్యోగులు సంస్థలని నిరంతరమూ ఒత్తిళ్ళు తీసుకువచ్చి సతాయించడం సమంజసం కాదు.

యితర నగరాల్లోని కాలేజీల్లో సీట్లు వచ్చినప్పుడు పిల్లల్ని పంపడానికి వెను దీయని తల్లిదండ్రులు, ప్రస్తుతం పన్జేస్తున్న ఊళ్ళలోనే కాలేజీల్లో చదువుకొంటున్న పిల్లల్ని హాస్టల్లో ఉంచి, మరో ఊరు బదిలీ మీద వెళ్ళడానికి చాలా చాలా రాద్ధాంతం చేస్తారు.

బదిలీలు ఆగలేదనీ, ఆపలేదనీ అధికారుల మీద నిందారోపణలు చెయ్యడం కూడా పరిపాటే. భార్యాభర్తలిద్దరూ పన్జేస్తోంటే ఈ బదిలీలనేవి చాలా విషమ సమస్యల్ని తీసుకువస్తాయి.

సీనియర్ యింజనీర్ హోదాలో ఉన్న ఒకామెకు ముంబయ్ నుంచి కోల్‌కతా బదిలీ అయింది. ముందుగానే ఎపాయింట్‌మెంట్ తీసుకొని నా పి.ఎ. ఘోష్‌తో సహా నా గదిలో అడుగు పెట్టింది. అంతకు ముందే ఘోష్ ఆమె వివరాలన్నీ నాకు చెప్పి హెచ్చరిం చాడు.

"సర్, నాకు కోల్‌కతా బదిలీ అయింది. నా భర్త ఈ ఊళ్ళో ఓ ప్రైవేటు సంస్థలో పన్జే స్తున్నాడు. అందుకని నా బదిలీ ఆపు చేయించండి" అందామె.

"భార్యాభర్తలిద్దరూ ఒకే సంస్థలో పనిచేస్తుంటే, యిద్దర్నీ ఒకే ఊరికి బదిలీ చెయ్యడానికి ఆస్కారముంటుంది. యిద్దరూ పనిచేసే విభాగం ఒకటే అయినప్పుడు చికాకు ఉండదు కాని, విభాగాలు వేరుగా ఉండి అవి అన్ని ప్రాజెక్టులలోనూ ఉండకపోయినా చికాకుగా ఉంటుంది. మీ విషయానికొస్తే వేర్వేరు సంస్థల్లో పనిచేస్తున్నారు. నేను చెయ్యకలిగింది ఏమీ లేదు. మీ సమస్యకు పరిష్కారం మీరే వెదుక్కోండి!" అన్నాను నిష్కర్షగా.

"సర్, అంటున్నానని ఏమీ అనుకోవద్దు. మీరందరూ స్త్రీల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తారు! అసలు మేం ఉద్యోగాలు చెయ్యడం మీ కిష్టంలేదు!" అంది నిందాపూర్వకంగా.

"నేను మిమ్మల్ని ఉద్యోగం మానమని చెప్పలేదే! కోల్‌కతా వెళ్ళి నిక్షేపంగా ఉద్యోగం

చెయ్యండి, ఎవరొద్దన్నారు?"

"అంటే నా వైవాహిక జీవితం ఏమైనా పర్వాలేదంటారు?"

"అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు. ఈ విషయాన్ని మీ భార్యాభర్తలే పరిష్కరించుకోవాలి కాని, ఆఫీసులు కాదు!"

"సర్, సునీత లేందే యిన్‌స్ట్రుమెంటేషన్ లేబొరేటరీ సక్రమంగా పనిచెయ్య లేదని ఒక్క వాక్యం వ్రాయండి. నా బదిలీ ఆగిపోతుంది!" అంది ఆమె కొంచెం స్వరం తగ్గించి.

"సునీతని పోస్ట్ చేస్తే కోల్‌కతా యిన్‌స్ట్రుమెంటేషన్ లేబొరేటరీ సక్రమంగా పన్జేస్తుందన్న నమ్మకంతో మిమ్మల్నక్కడికి బదిలీ చేశారు!"

"మీరు నన్ను కావాలని అపహాస్యం చేస్తున్నారు, భావ్యం కాదు!" అందామె రోషంగా.

"మీ పర్సనల్ ఫైల్ తెప్పించి చూశాను. కావాలంటే మీరూ చూడవచ్చు" అంటూ బల్ల సొరుగులోంచి ఓ గ్రీన్ కవరు ఫైలు తీసి ఆమె ముందుంచాను. సునీత దాన్ని తెరిచి చూడ్డానికి ప్రయత్నించలేదు.

మళ్ళీ నేనే అన్నాను.

"మీరు చేరినప్పట్నుంచీ పన్నెండు సంవత్సరాలుగా ముంబయ్‌లో పన్జేస్తున్నారు. మీరింతవరకూ మూడుసార్లు బదిలీలు ఆపు చేయించుకొన్నారు. మాకంటే చాలా ఎక్కువ కాలం ముంబయ్‌లో ఉంటున్నవాళ్ళని బదిలీ చెయ్యకుండా, మమ్మల్నెందుకు బదిలీ చేస్తున్నారని యిరవై మంది రిప్రెజెంటేషన్స్ పెట్టుకొన్నారు. అందరూ మీ పేరే ఉదహరించారు. అభియోగం చేసిన వాళ్ళందరూ మగవారే అంటే అనుకోవచ్చు. అందులో ఆరుగురు స్త్రీలు! వాటికి సమాధానం ఇవ్వలేక నాకు ముందు ఈ కుర్చీలో కూర్చున్న పెద్దమనిషికి తలబొప్పి కట్టింది. ఎందుకంటే మీరు ప్లే చేసిన సింపతీ కార్డుకి ఆయన రెండుసార్లు బోల్తా పడ్డాడు! మీ వ్యక్తిగతమైన సమస్యలకి అధికారుల్ని యిబ్బంది పెట్టడం భావ్యంకాదు."

నేనంతగా గట్టిగా చెబ్తానని ఆమె అనుకోలేదు. పాలిపోయిన ముఖంతో చూస్తూ కూర్చుండిపోయింది.

"మరోమాట వినండి. అందరితోనూ కలిసి పని చెయ్యడానికి ముందుకొచ్చినప్పుడు అందరిలాగే పనిచెయ్యాలి. స్త్రీ నంటూ యిల్లాలినంటూ జాలి కోసం అర్థిస్తే అది స్త్రీవాదమనిపించుకోదు. మీరింక వెళ్ళవచ్చు" అన్నాను కఠినంగా.

ఆమె మౌనంగా లేచి వెళ్ళిపోయింది.

స్త్రీవాదానికి నేను వ్యతిరేకినని అభాండం వేస్తే వేయండి. నేనేమీ అనుకోను. ఆఫీసు వాదానికి విరుద్ధమైన ఏ వాదాన్నీ నేను సమర్థించలేను. సమర్థించి తలనొప్పి వ్యవహారాలు తెచ్చుకోలేను.

అయితే ఆ భార్యాభర్తలిద్దరూ సెలవు మీద ఢిల్లీ పోయి తిరిగి వచ్చారు. ఆమె బదిలీ ఆగిపోయింది. అయిదంకెల జీతం ఎంతటి ప్రయత్నాలనైనా చేయిస్తుంది మరి! యిరవై యిద్దరు రిప్రెజెంటేషన్స్ చేశారు. ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంటూ, సెక్రటరీ వచ్చి నన్ను నిలదీశారు.

"ఆమె కూడా మీ అసోసియేషన్ మెంబరే! నిజానికి ఆమె బదిలీ చేయించిందీ నేను కాదు. ఆపు చేయించిందీ నేను కాదు! ఎలా ఆపు చేయించుకొందో ఆమెనే అడగండి. ఎందుకు ఆపు చేశారో హెడ్ క్వార్టర్స్ వాళ్ళని అడగండి. అంతే కాని మీ ప్రశ్నలకీ, వాళ్ళ రిప్రెజెంటేషన్స్‌కీ సమాధానాలిచ్చుకోవలసిన అవసరం నాకు లేదు! యివ్వవలసి వచ్చినా నా దగ్గరసమాధానం లేదు!" అన్నాను లేని కోపం ప్రదర్శిస్తూ.

లేచిన అలజడి నెమ్మదిగా సర్దుకుపోయింది. నేను ముందస్తుగానే చెప్పాను కదా, యిటువంటి విషయాల్లో జయాపజయాల ప్రసక్తి లేదని.

విభాగాల ప్రధానాధికారులు కూడా ఫలానా వ్యక్తి లేందే పని కుంటుపడ్తుంది కాబట్టి బదిలీ చేయ్యవద్దనో, లేదా వాయిదా వెయ్యమనో ఉద్యోగుల తరపున వకాల్తా పుచ్చుకొని కితాబులిస్తుంటారు. ఈ విధమైన పంథా కూడా చాలా చికాకులు తీసుకువస్తుంది. ఈ విషయంలోనూ అధికారులు నిజానిజాల్ని గుర్తించకపోతే సమస్యల్ని కొని తెచ్చుకొన్నట్టవుతుంది. యిటువంటి అస్త్రాల్ని తిప్పి కొట్టడానికి, నేనూ ఓ అస్త్రం ఉపయోగిస్తుంటాను.

"అందర్నీ సరైన మార్గంలో పెట్టకుండా అంతా ఒకరిమీదే ఆధారపడేటట్లుగా చెయ్యడం సమర్థత అనిపించుకోదు! పనిలో నైపుణ్యత అన్నది ఏ ఒక్కరితోనో ఆగిపోకూడదు!".

చాలాసార్లు వాళ్ళు చెప్పిన కారణాలే వాళ్లకి చెప్పి, ఆ ఫలానా వ్యక్తులకి సెలవు కూడా మంజూరు చెయ్యలేదు. సెకండ్‌లైన్ ఆఫ్ డిఫెన్స్ లేని కారణంగా చాలా బదిలీలు ఆగిపోవడం సాధారణమే. యిది వ్యవస్థకి మంచిది కాదు.

వ్యక్తిగతమైన సమస్యల్ని ఏ సంస్థా పరిష్కరించలేదు. తోటివారికి కష్టం కలగని ఏ కొద్ది విషయాల్లోనో తప్ప, ఆనవాయితీగా అందరికీ, అన్ని విషయాల్లోనూ సంస్థలు సహాయం చెయ్యడం సాధ్యం కాని పని.

రాష్ట్రం దాటి మరో రాష్ట్రంలో పనిచేస్తే దేశమంటే స్వరాష్ట్రం ఒక్కటే కాదనీ, విభిన్న సంస్కృతులతో కూడిన అనేక రాష్ట్రాల కూటమి అని ఓ అవగాహనా, సుహృద్భావమూ ఏర్పడతాయి. కేంద్ర ప్రభుత్వం సంస్థల్లో కాని, లేదా దేశవ్యాప్తమైన యితర సంస్థల్లో కాని పనిచేస్తూ దేశమంతటా నివసించగల అవకాశం ఉన్న ఉద్యోగులు - సాంస్కృతిక సమ్మేళనానికీ, పరస్పరావగాహనకీ, దేశ సమన్వయతకీ దోహదం చేసే బదిలీలని ఆహ్వానించాలే కాని, నిరసించకూడదు.